# ఫర్టిలైజర్ షాప్ ముందు రైతుల ఆందోళన






**రిపబ్లిక్ హిందుస్థాన్ నల్లబెల్లి:** నల్లబెల్లి మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ షాపు ముందు నకిలీ మందులు ఇచ్చారని రైతుల ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే కొండి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు ముద్దం యుగంధర్ రెండు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నాడు నల్లబెల్లిలోని ఖాజా మైనుద్దీన్ ఫర్టిలైజర్ షాపు నుండి పురుగుమందులు తీసుకెళ్లి పంటకు పిచికారి చేయగా వారం తర్వాత మొక్కలు చనిపోవడం చూసి ఆందోళన చెందిన రైతు షాప్ కు వచ్చి అడగగా షాపు యజమాని పంటను పరిశీలించి కంపెనీ ప్రతినిధులను పిలిపించి న్యాయం చేస్తానని చెప్పినట్లు బాధిత రైతు తెలిపాడు. గత 15 రోజులుగా ఈరోజు రేపు అని బాట వేస్తుండడంతో సోమవారం రోజు షాపు వద్దకు వచ్చి యజమాని కాళ్లు పట్టుకొని నాకు న్యాయం చేయాలని కోరగా షాపు యజమాని స్పందించకపోవడంతో షాప్ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ప్రశాంత్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఈ కేసు సిఐ దృష్టిలో ఉందని సీఐ కార్యాలయానికి వెళ్తే కచ్చితంగా న్యాయం జరుగుతుందని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించి సీఐ కార్యాలయానికి వెళ్లడం జరిగింది.

## పదోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయి - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

**పదోన్నతి స్టార్ చిహ్నాన్ని భుజాలపై అలంకరించిన జిల్లా ఎస్పీ.**

**హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ పదోన్నతి పొందిన మహమ్మద్ అబ్దుల్ రౌఫ్.**



**ఆదిలాబాద్, రిపబ్లిక్ హిందుస్థాన్ (సోమ 04 ):** తాంసి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐగా పదోతాంసి పొందిన మహమ్మద్ అబ్దుల్ రౌఫ్ సోమవారం రోజు ఉదయం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ని పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదోన్నతి పొందిన ఏఎస్ఐ గారికి పదోన్నతి చిహ్నం స్టార్ ను భుజాలపై అలంకరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు న్యాయం సేకరించే విధంగా ఉండాలని సూచించారు. సమస్యలు తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలాలకు చేరుకుని బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తూ ఉండాలని సూచించారు. నీతి నిజాయితీ గా విధులు నిర్వర్తించినప్పుడు పోలీసుల కీర్తి ప్రతిష్టలు సమాజంలో అధికమవుతాయని సూచించారు. పదోన్నతి పొందిన ఏఎస్ఐ పదోన్నతితోపాటు, బదిలీగా ఆదిలాబాద్ జిల్లా నుండి నిర్మల్ జిల్లాకు వెళ్లడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ కు గుండమల్లేష్ పేరు పెట్టాలని సిపిఐ వినతిలి

**రిపబ్లిక్ హిందుస్థాన్, బెల్లంపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో, బెల్లంపల్లిలో నిర్మించిన కూరగాయల సముదాయానికి అమరజీవి కామ్రేడ్ గుండమల్లేష్ నామకరణం చేయాలని సోమవారం రోజు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కి మెమోరాండం అందించారు. సిపిఐ నాయకులు, మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గుండమల్లేష్ పేరును ప్రతిపాదించి, ప్రజాభిప్రాయం ప్రకారంగా నామకరణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ పార్టీ కార్యదర్శి కామ్రేడ్ ఆడెపురాజమౌళి, సిపిఐ బెల్లంపల్లి మండల పార్టీ కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ, బి కే ఎం యు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గుండా చంద్రమాణిక్యం, బెల్లంపల్లి సిపిఐ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ రత్నం రాజం పాల్గొన్నారు.

## నేటి నుండి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలు

**ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా.**





**రిపబ్లిక్ హిందుస్థాన్, ఉట్నూర్ :** రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాల పోటీలు రేపు మంగళవారం ఉదయం 10..00 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు. రాష్ట్ర స్థాయి లో 33 జిల్లాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు 1600 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొననున్నారని , 300 మంది కోచ్ లు వస్తున్నారని తెలిపారు. నవంబర్ 5,6,7 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయిలో జరుగు గిరిజన క్రీడోత్సవాల పోటీలలో అథ్లెటెక్స్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్, కబడ్డీ, ఆర్చరీ, టెన్ని కాయిన్ తదితర క్రీడలలో విద్యార్థులు పాల్గొన నున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల ఏర్పాట్లను స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, రమేశ్, తదితరులు పరిశీలించి క్రీడాకారులకు పలు సలహాలు , సూచనలు చేశారు .

## కులగణన పేరుతో ... రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు బలోపేతం..



**రిపబ్లిక్ హిందుస్థాన్, ఆదిలాబాద్:** కులగణన పేరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు 15 రోజులపాటు ఒక్కపూట సెలవులు ప్రకటించడం సరికాదనీ టిటీఏఫ్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ అన్నారు . ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడలేక కుదేలైన ప్రభుత్వ ప్రాథమిక విద్యావ్యవస్థ మరింత దిగజారిపోతుందనీ, తల్లిదండ్రులు ఉదయం పూట విద్యార్థులను పాఠశాలల్లో వదిలి కూలీ నాలి చేసుకోవడానికి వెళుతుంటారనీ, మధ్యాహ్నం పూట వదిలివేయడం వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందనీ అన్నారు. అంతేగాక ఇది ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి మరింత ఉపయోగపడుతుందన్నారు. కులగణన సెలవుల వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడే అవకాశం ఉందని ఉట్నూరు సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. ఈ నెలలోనే నేషనల్ ఆచివ్ మెంట్ సర్వే ఉందనీ , దీనికోసం విద్యార్థులను సంసిద్ధత చేయాల్సిన అవసరం ఉందనీ తెలిపారు . లేదంటే జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్ర రేటింగ్ పడిపోయే అవకాశం ఉందనీ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిఎఫ్ నాయకుడు జాదవ్ పవన్ లాల్ పాల్గొన్నారు.

# పదేళ్ల బీజేపీ పాలన భేష్..

**పది నెలల కాంగ్రెస్ పాలన తుస్...**

**కేంద్రాన్ని విమర్శించే స్థాయి పొన్నంకు లేదు ..**

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**

**జగిత్యాల :** పదేళ్ల మోడీ పాలనలో విద్వేష ప్రచారము, విధ్వంస చర్యలు తప్ప దేశానికి చేసింది ఏమీ లేదని ఇచ్చిన హామీలు అమలు చేయలేదని సమాజం కేంద్ర ప్రభుత్వాన్ని క్షమించదని ప్రజాపాలనపై అవాకులు చెవాకులు పేల్చొద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ ని ఉద్దేశించి మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు.సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడారు పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని రంగాల్లో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అది తట్టుకోలేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికి వెళ్లినా ఆరు గ్యారంటీల అమలు విషయంలో తెలంగాణా ప్రజలు ప్రశ్నించి అమలు చేయాలని ఎదురు తిరిగితే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు ముఖము చాటేసుకుంటున్నారని ఏద్దేవా చేశారు.ఖరీఫ్ సీజన్ అయిపోయి రబీ సీజన్ ప్రారంభమైన ఇంతవరకు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని రెండు లక్షల పైబడి ఉన్న రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. బిజెపి 10 ఏళ్ల పాలనలో దేశంలో ఎక్కడ కూడా విద్వేష ప్రచారం విధ్వంస చర్యలు జరగలేదని పదేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో చాలా చోట్ల మత ఘర్షణలు జరిగాయని ఇటీవల హైదరాబాదులోని పాతబస్తీలో నాలుగు హిందూ దేవాలయాలపై విధ్వంస చర్యలు జరిగాయని దీనికి అంతటికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణం కాదా అని ప్రశ్నించారు. మోడీ పదేళ్ల పాలన ప్రజా రంజకంగా ఉంది కాబట్టే మూడవసారి భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు అనే విషయం మంత్రి గుర్తించాలని అన్నారు.బీజేపీని విమర్శించడం మానుకొని ఆరు గ్యారంటీలు అమలు చేయాలని అన్నారు. వరికోతలు ప్రారంభం అయి నెల రోజులు గడుస్తున్న రైతులు కుప్పలు తెప్పలుగా దాన్యాన్ని తరలించిన ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించలేదని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు నష్టపోతే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని సత్యమ్ అన్నారు...

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి




**జగిత్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డితో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ లు మధు సుధన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దు!



**సిద్దిపేట :** సాధ్యమైనంత వరకు రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దు రోడ్లపై ధాన్యాన్ని పోసి నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్ప కనపడక ధాన్యము కుప్పకు ఢీకొని చనిపోయిన సంఘటనలు మన జిల్లాలో జరిగాయి. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుంది. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# వరిధాన్యం కొనుగోలు ప్రారంభం



**జమ్మికుంట :** జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం సోమవారం ఉదయం ప్రారంభించారు.. జమ్మికుంట లోని పాత వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు తీసుకువచ్చే వడ్లని ఆరబెట్టుకుని తీసుకురావాలని తేమశాతం 17% లోపు ఉన్నట్లయితేనే కొనుగోలు చేయడం జరుగుతుందని గ్రేడ్ ఏ రకం క్వింటాల్ 2320 రూపాయలు, సాధారణ రకం 2300 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు.. రైతులు పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు, అందించాలని తెలిపారు..

Printed , Publisher , Edited and Owned by Rathod Raju , Printed at Jai Bhavani Printing Press , H.No. 2-42, Village : Jamidi Mdl. Ichoda Dist. Adilabad., State Telangana , Pin code – 504 307 ( T.S.) ,
TITLE CODE : TELTEL02020EDITOR : RATHOD RAJU , Contact Numbers : 9908940762 , 8985614333 . Email : republichindustan.rh@gmail.com , www.republichindustan.in ,